సమస్యల పరిష్కారమే ధ్యేయం


సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్సీని కలిసి వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన రాజు ఆయా విభాగాల అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంఎల్ఆర్ విద్యార్థిని

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలో బీఎస్‌ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థిని ఎన్ఎస్ఎస్ వలంటీర్ గుగ్లావత్ యశస్విని న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైంది. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు యశస్వినిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిపబ్లిక్ పరేడ్‌కు రాష్ట్రం నుంచి తమ కళాశాల విద్యార్థిని ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా తాము నిత్యం ప్రోత్సహిస్తూ ఉంటామని, దేశానికి సేవ చేయాలనే తపన విద్యార్థుల్లో కలిగేలా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్ గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.


యశస్వినిని అభిందిస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఉదయ్ రంజన్‌గౌడ్

'మనూ' ఎంపవరింగ్‌కు కేంద్రం నిధులు

రూ.95 కోట్ల నిధుల కేటాయింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంపవరింగ్ టెక్నాలజీ కోసం కేంద్రప్రభుత్వం రూ.95 కోట్ల నిధులను మంజూరు చేసింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం (సీఎస్ అండ్ ఐటీ) కోసం భారత ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ రూ.95 కోట్లను మంజూరు చేసింది. సీఎస్ అండ్ ఐటీ స్కూల్ చీఫ్ ఇన్వెస్టిగేటర్, డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ ఆధ్వర్యంలో 'వర్చువల్ రియాలిటీ బేస్డ్ అసిస్టివ్ సిస్టమ్ ఫర్ లెర్నింగ్ అండ్ అసెస్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ ఆఫ్ ఇంటలెక్చువల్ డిసేబిలిటీస్' అనే ప్రాజెక్టు కోసం ఈ నిధులను పొందడం ద్వారా అన్ని అంచనాలను అధిగమించింది. ఈ ప్రాజెక్టు అమలుకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సర్వీసెస్ ఇన్కార్పొరేటెడ్ (ఎన్ఐసీఎస్ఐ), ఉర్దూ విశ్వవిద్యాలయం సహకరిస్తాయి.

వైస్‌చాన్స్‌లర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభినందన..

కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులను రూ.95 కోట్లు సాధించినందుకు ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ బృందాన్ని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు సేవచేయడం, వారిని ఉద్ధరించడంలో ఈ మార్గదర్శక ప్రయత్నం నిరంతర విజయం, సుధూర ప్రభావంపై ఆయన చాలా ఆశలు వ్యక్తం చేశారు. తరుచుగా నిర్లక్ష్యం చేయబడిన లేదా తక్కువ సేవలందించే వారి అత్యవసర అవసరాలను తీర్చేందుకు ప్రాజెక్టు కరుణ, సానుభూతిని వ్యక్త పరుస్తుందన్నారు. సామాజిక సంక్షేమానికి ఉద్దేశించిన ప్రాజెక్టులకు పెరుగుతున్న గుర్తింపు, మద్దతును ఈ నిధుల మంజూరు ద్వారా నొక్కి చెబుతున్నాయన్నారు.


ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనాభవనం

భళా.. విశ్వం ఆవిర్భావంపై విద్యార్థుల ఆవిష్కరణలు



శ్రీనగర్‌కాలనీ: భారతీయ సంస్కృతి-సంప్రదాయాలు, విశ్వం ఆవిర్భావం, గ్రహాలు వంటి వాటిపై విద్యార్థులు చేసిన ప్రయోగ ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. బుధవారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో ప్రజా మేళా పేరిట సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు భారతీయ పురాతన సంప్రదాయాలు, విశ్వంలోని గ్రహాలు, వాతావరణ విషయాలను తెలుపుతూ తయారు చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సైన్స్, కళల పట్ల మరింత అవగాహన పెంచేందుకు ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశామని స్కూల్ సీఈఓ మోహనవంశీ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ మధుమతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యర్థాలతో అవస్థలు

చింతల్: అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ వ్యర్థాలు ఎక్కడికక్కడ పారవేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సీసీ రోడ్లు వేసినా నిర్మాణ వ్యర్థాల కారణంగా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. సీసీ రోడ్లు వేసే క్రమంలో గల్లీల్లో చేపట్టిన తవ్వకాల ద్వారా వచ్చిన మట్టి, సిమెంటు వ్యర్థాలను గల్లీలకు చివర కుప్పలుగా పోయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అంతేగాక వీటి కారణంగా వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.


భగత్‌సింగ్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణ వ్యర్థాలు

వసతులను సద్వినియోగం చేసుకోవాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో తనిఖీలు
- బస్తీ దవాఖానాలో రికార్డుల పరిశీలన
- మునిసిపల్ అధికారులతో సమీక్ష


ప్రగతినగర్‌లో పార్కులో మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్


నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో..

నిజాంపేట్: ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసి వసతులను సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం ఆయన నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్యటించారు. ఈ సందర్భంగా పార్కులు, బస్తీ దవాఖానాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముందుగా ప్రగతినగర్ పరిధిలో ఉన్న పార్కులను సందర్శించిన కలెక్టర్ గౌతమ్ పార్కులో మొక్కలు, వాకింగ్ ట్రాక్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో ఉన్న క్రీడా మైదానాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రజలకు మంచి ఆరోగ్యం కల్పించడంతో పాటు వారికి అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉండేలా అర్బన్ పార్కులను ఏర్పాటు చేసిందన్నారు.

◆ బస్తీ దవాఖానా తనిఖీ

ప్రగతినగర్లో బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ గౌతమ్ అకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులను పలకరించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చే ప్రజలతో సిబ్బంది ఆత్మీయంగా మాట్లాడాలని, అప్పుడే ప్రజలకు వైద్యుల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులు, రిజిష్టర్లు, మందులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఆసుపత్రి స్టాక్ రిజిస్ట్రర్‌ను పరిశీలించి అవసరమైన మందులను తెప్పించుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు. ల్యాబ్‌లో డయాగ్నస్టిక్‌కు సంబంధించి వస్తున్న రోజువారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

◆ మున్సిపల్ అధికారులతో సమీక్ష..

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందేందుకు అందరి సహకారం అవసరమన్నారు. సకాలంలో మున్సిపల్ టాక్స్‌లు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా మున్సిపల్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు తగినన్ని నిధులు సమకూరతామన్నారు. పార్కులు, రోడ్లు, డ్రైనేజీ తదితర ముఖ్య వసతులను ఎప్పటికప్పుడు మెరుగు పరచాలని, ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, బాచుపల్లి తహశిల్దార్ పుల్ సింగ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రగతినగర్ బస్తీ దవాఖానాలో తనిఖీలు


బస్తీ దవాఖానాలో రిజిస్ట్రర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

23న ముక్కోటి ఏకాదశి వేడుకలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ వేడుకలను ఆలయ అర్చకుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. ఆలయంలో తెల్లవారుజామున 4.30 గంటలకు కాగడ హారతితో వేడుకలను ప్రారంభిస్తామని, అనంతరం 5గంటలకు వినాయక, దత్తాత్రేయ, షిర్డీసాయిబాబా వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామని ప్రకటించారు. 6 గంటల నుంచి భక్తులు షిర్డీసాయిబాబా వారికి ప్రత్యేకంగా ఉత్తర ద్వారం నుంచి దర్శించుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే అవకాశం ఉండటంతో భక్తులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు.

నేడు అవని ఫెర్టిలిటీ ఆండ్రాలజి హాస్పిటల్ ప్రారంభం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 1లోని మేగ్నస్ డయాగ్నస్టిక్ పై అంతస్తుపై అవని ఫెర్టిలిటీ ఆండ్రాలజి హాస్పిటల్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. తమ ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియర్ డైరెక్టర్, ఫెర్టిలిటి కన్సల్టెంట్ డా. టి. యస్ శాలినీ పర్యవేక్షణలో వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు.

శ్రీనయ్యకు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌సీ)లో బాద మోని శ్రీనయ్యకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.వీబీ నరసింహ పర్యవేక్షణలో క్లౌడ్ కంప్యూటింగ్ అడాప్షన్ మోడల్ ఫర్ ఈ-గవర్నమెంట్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. డాక్టరేట్‌ను అందుకున్న శ్రీనయ్యను పలువురు అభినందించారు.

సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్ట్

మేడ్చల్: సఖీ కేంద్ర సేవలను అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మీటింగ్‌లో టీచర్లు, సూపర్‌వైజర్లకు బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ వాసవి మాట్లాడుతూ మహిళలు, బాలికల కోసం సఖీ కేంద్రం ఎన్నో సేవలను అందిస్తోందని, వాటిపై అవగాహన పెంచుకొని సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు సుకన్య సమృద్ధి యోజన, ముద్ర యోజన, అటల్ పెన్షన్, బాల్యవివాహాల నివారణ, చైల్డ్ హెల్ప్‌లైన్, లైన్ నంబర్ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, సీడీపీఓ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు జీఐఎల్‌టీలో 'సృజన టెక్ ఫెస్ట్'

రాయదుర్గం: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో గురువారం 'సృజన టెక్‌ఫెస్ట్' పేరిట ప్రత్యేక టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ ఎస్.ఎ క్వాల్‌హుస్సేన్ తెలిపారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో ఉదయం 9.30 గంటలకు స్పెషల్ బ్రాంచ్ క్లస్టర్ కోసం జిల్లాస్థాయి రంగారెడ్డిజిల్లా సృజన టెక్‌ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫెస్ట్ ద్వారా విద్యార్థులలో సాంకేతిక ప్రాజెక్టుల ద్వారా వినూత్న ఆలోచన, ఆచరణాత్మక నైపుణ్యాలను ప్రోత్సహించడమే ఈ ఫెస్ట్ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులకు కూడా తమలోని సృజనాత్మకతను, నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలను వెలికితీసేందుకు అవకాశం కల్పించినట్లవుతుందన్నారు. అత్యుత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి రాష్ట్రస్థాయి సృజన టెక్‌ఫెస్ట్ పోటీలకు పంపుతామని ఆయన వివరించారు.

నేడు నిధి ఆప్కే నిఖత్...

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిధి ఆప్కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ తెలిపారు. గురువారం ఉదయం 9నుంచి సాయంత్రం 6 గంటల వరకు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఖాతాదారులు కండ్లకోయలోని నీరజ్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో, మేడ్చల్ జిల్లాకు చెందిన ఖాతాదారులు కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, బహదూర్‌పల్లిలోని ఆహ్లాద ఇంజినీర్స్ క్యాంపస్‌లో హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.

ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఇఎల్, జీడిమెట్ల,సనత్‌నగర్ తదితర ప్రాంతాల ఖాతాదారులు పాల్గొనవచ్చన్నారు.

ఎప్పుడు ఏమి జరుగునో..?


సాబేర్‌నగర్ వద్ద గాజులరామారం రోడ్డులో


షాపూర్‌నగర్ రైతు బజారు సమీపంలో


జీడిమెట్ల బస్టాప్ వద్ద..

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంబడి ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. ఒరిగిన, శిథిలమైన స్తంభాల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవేందర్‌నగర్ నుంచి గాజులరామారానికి వచ్చే మార్గంలో ఓ స్ట్రీట్‌లైట్ స్తంభం ఓ వైపు ఒరిగి తీగల ఆధారంగా నిలుచుంది. జీడిమెట్ల బస్ డిపో బస్టాప్ సమీపంలోని ఓ విద్యుత్ తీగల స్తంభం కిందిభాగం శిథిలమైంది. షాపూర్‌నగర్ రైతు బజారు సమీపంలో నర్సాపూర్ రాష్ట్ర రహదారి పక్కగా ఓ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



రంగారెడ్డినగర్: సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు 24 గంటల పాటు నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి.. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్ల వెంట అధికారులు వీధి దీపాలు, ప్రధాన చౌరస్తాల్లో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. అయితే వాటిని సాయంత్రం 6 గంటలకు ఆన్ చేసి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు ఆఫ్ అయ్యేలా టైమర్లను అమర్చారు. అయితే కొద్ది రోజులుగా టైమర్లు పని చేయకపోవడంలో 24 గంటల పాటు లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ వృథా అవుతోందని, ఇప్పటికైనా స్పందించి వీధి దీపాలు ఆన్ ఆఫ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆశీర్వాదం


ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుతో వేద పండితులు

జగద్గిరిగుట్ట: ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును బుధవారం ఆయన నివాసంలో తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘానికి చెందిన వేద పండితులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, ఆశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో మునుకుంట్ల రాజేశ్వర శర్మ, నారాయణ చక్రవర్తి, అవధానుల ప్రసాద శర్మ, ఓరుగంటి కేదార్నాథ్ శర్మ, రుద్రవీణ బాలసుబ్రమణ్య శర్మ, మాడా వెంకటరమణ శర్మ, ఉప్పల అనిల్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గూడ ఐలయ్య

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, గురుకుల పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ నాయకులు గూడ ఐలయ్య ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఐలయ్య తెలిపారు.

వీరు..మారరంతే...


ట్రాఫిక్ బొల్లార్డ్స్ మధ్యలో నుంచి వెళ్తున్న వాహనాలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాప్ నుంచి కూకట్‌పల్లి వెళ్లే దారిలో ట్రాఫిక్ సిబ్బంది ఇటీవల బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. అయితే ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు వాటిని పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వెళ్తూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారు. వీరిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గాజులరామారం సర్కిల్ వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా చంద్రశేఖర్ రెడ్డి

కుత్బుల్లాపూర్: గాజులరామారం సర్కిల్ వైద్య ఆరోగ్యాధికారిగా చంద్రశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్ఎంఓ గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వుల మేరకు ఉప కమిషనర్ మల్లారెడ్డిని కలిసి బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ప్రశాంతి సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జిగా మమత బాధ్యతలు నిర్వహించేవారు.

ఘనంగా ఇరుముడి పూజ


శబరిమలకు తరలి వెళ్తున్న స్వాములు

దుండిగల్: దుండిగల్‌కు చెందిన గోపీ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి మాలధారులు బుధవారం శబరిమలై తరలి వెళ్లారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజన్ నంబూత్రి గురుస్వామి స్వాములకు ఇరుముడి కట్టారు. కార్యక్రమంలో నందకృష్ణ, మోహన్, విష్ణు, అభినవ్, ధనరాజ్, లక్ష్మణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక వేదికలతో నూతన ఆవిష్కరణలు


విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు

సుభాష్‌నగర్: వినూత్న ఆవిష్కరణలకు పాఠశాల స్థాయి వైజ్ఞానిక వేదికలు దోహదపతాయని మేడ్చల్ జిల్లా టీఆర్ఎస్ఎంఏ అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని సహస్ర స్మార్ట్ హైస్కూల్‌లో బుధవారం కరస్పాండెంట్ జీఎస్ రాజు, ప్రిన్సిపాల్ రజనీ కుమారి ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ, సాంకేతిక పరమైన అంశాలపై నమూనాలను రూపొందించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ట్రెజరర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా వెన్నెలగడ్డ చెరువు


వెన్నెలగడ్డ చెరువులో వ్యర్థాలను పారబోస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: చెరువుల పరిరక్షణకు ఓవైపు ప్రభుత్వాలు రూ. కోట్లు వెచ్చిస్తుండగా మరోవైపు కొందరు నిర్లక్ష్యంతో వాటిని కాలుష్య కాసారాలుగా మారుస్తున్నారు. జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని వెన్నెల చెరువులో పట్టపగలే వ్యర్థాలను పారబోస్తూ చెరువును పూడ్చి వేస్తున్నారు. ఒకప్పుడు వ్యవసాయం, తాగునీటి అవసరాలను తీర్చిన ఈ చెరువును ప్రస్తుతం డంపింగ్ యార్డును తలపిస్తోంది. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని వ్యర్థాలు పారుపోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కర సేవకులకు సన్మానం

చింతల్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నివసిస్తున్న అయోధ్య కర సేవకులను భాగ్యనగర్ శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో సత్కరించనున్నట్లు బీజేపీ నాయకుడు, భాగ్యనగర్ శివాజీ సేవా సమితి సభ్యుడు నందనం దివాకర్ తెలిపారు. కర సేవకులను ఛత్రపతి శివాజీ పురస్కారంతో సత్కరించడంతో పాటు అయోధ్య రామమందిరం దర్శనానికి తీసుకువెళతామన్నారు. కరసేవకులు తమ పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను ఈ నెల 29 లోగా 9490760980/ 6302871983/ 9618501010 నెంబర్లకు పంపాలన్నారు.